విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 30, ఏప్రిల్ 2023

హౌసింగ్ డే సదస్సు

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండల కేంద్రంలోని కాలమ్మ దేవి ఆలయ ప్రాంగణంలో హౌసింగ్ డే సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో జగనన్న కాలనీలలో ఇంటి పట్టాలు, పక్కా గృహాలు మంజూరైన గృహ నిర్మాణ లబ్ధిదారులతో ఎంపీడీవో ఎం. భాస్కర్ బాబు అధ్యక్షతన అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో ఇల్లు, ఇంటి స్థలాలు మంజూరైన లబ్ధిదారులందరూ కూడా తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేసుకొనవలసినదిగా తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ నిరోషా, జెడ్పిటిసి హసీనాబాను, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు రుద్రమ్మ, బళ్లారి లింగప్ప, సూజీ మహేష్, వైసీపీ నాయకులు సింగాడి మంజునాథ , శివారెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.పంచాయతీ కార్యదర్శులు ఏవీఎస్ వెంకటరమణ, కృష్ణయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు ఈ కేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ సబ్ ట్రెజరీ కార్యాలయము నుంచి పెన్షన్ పొందుతున్న పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అందరూ కూడా మే 10వ తేదీ లోపు ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు కె. క్రిష్టప్ప తెలిపారు. శనివారం ఉరవ కొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంకా ఎవరైనా ఈ కేవైసీ చేయించుకొని వారు ఉంటే ఎస్ టి ఓ కార్యాలయం లో ను లేదా పెన్ష నర్ల భవనం నందు చేయించుకోవాలన్నారు.

వేలంపాటలో ఆదాయం

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మద్యం కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు ఆటో రెండు కార్లు అనంతపురం ఎక్సైజ్ సూపరిడెంట్ ఆదేశాల మేరకు శనివారం బొమ్మనహాల్ పోలీస్ స్టేషన్లో వేలంపాట నిర్వహించారు. బొమ్మనహాల్ ఎస్సై శివ, కనేకల్ ఎక్సైజ్ సీఐ గోపికృష్ణ లో వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో 8 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలంపాట నిర్వహించగా రూ.1.69 లక్ష వేలం పాటలో పోగా జీఎస్టీ రూ.30,420 కలుపుకొని రూ.1.99లక్ష లు ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ శివ తెలిపారు. రెండు కార్లు ఈ వేలం పాటలు అమ్ముడు పోలేదని ఎస్సై

టీడీపీని ఆదరించండి

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని భోగాల కట్ట, నగరూరు గ్రామాల్లో శనివారం తాడిపత్రి టీడీపీ ఇన్‌ఛార్జ్ జెసి అస్మిత్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. గ్రామస్తుల యోగక్షేమాలు తెలుసుకుంటూ గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక ప్రజలతో తెలుగుదేశం పార్టీని ఆదరించాలన్నారు. భోగాల కట్ట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డిని పరామర్శించారు. నగరూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో రహదారి సమస్యను కాలనీవాసులు ప్రస్తావించగా, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్, రవి కుమార్ రెడ్డి, రాజశేఖర్, రవికుమార్ రెడ్డి, వెంకట్ రామిరెడ్డి, నాగముణి రెడ్డి ,నగరూరు నరసింహులు, నాగేశ్వర్ రెడ్డి, కూచి వేణు, భాస్కర్ రెడ్డి, అశ్వర్థ రెడ్డి, త్రినాథ్ రెడ్డి, దేవేంద్ర, రాము నాయక్, దడియాల ఆది,బొట్టు శేఖర్, మధు రాజు, తాంద్ర విక్రమ్, నీలకంఠారెడ్డి, తిరంపురం నీలకంఠ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతులు తరలింపు

విశాలాంధ్ర-ఉరవకొండ: పట్టణంలో విపరీతంగా పెరిగిపోయిన కుక్కలు మరియు కోతులను బంధించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనిపై మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో కోతలు కుక్కలు బెడద వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తరచు కుక్కలు కరవడం వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతుండడంతో నెల్లూరు జిల్లాకు చెందిన కొంతమంది కోతలు, కుక్కలను పట్టి బంధించే వారి చేత వీటిని బంధించి సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

కలశ ప్రతిష్టాపన పూజలు ప్రారంభం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో సోమనాథేశ్వర స్వామి, వీరభద్ర స్వామి గోపురాల్లపై కలశ ప్రతిష్టాపించేందుకు శనివారం పూజలు ప్రారంభమయ్యాయి. 101 కలశాలతో నంది కోళ్లు, వీరభద్ర వేషధారణలతో గంగాజలం తెచ్చి ప్రతిష్టాపన పూజలు ప్రారంభించారు. భారీ ఊరేగింపుతో వెళ్లి గంగాజలం తెచ్చి స్వామివారికి అభిషేకించి పూజలను ప్రారంభించారు. పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరిపించారు. నేడు ఆదివారం వేకువ నుండి కలశ ప్రతిష్టాపన పూజలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: రేషన్ దుకాణాల్లో తూకల్లో మోసాలకు పాల్పడితే సంబంధిత డీలర్ పై చర్యలు తీసుకుంటామని తాహసిల్దార్ శ్రీనివాసులు స్టోర్ డీలర్లను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రమైన బొమ్మనహాల్ తాహసిల్దార్ కార్యాలయంలో స్టోర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకులు అందించాలన్నారు. ప్రతినెల చౌక దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. లబ్ధిదారుల నుండి ఫిర్యాదులు వస్తే సంబంధిత డీలర్ పై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలకిషన్, వీఆర్వోలు, స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.

20 ఏళ్ళుగా నివాసం ఉంటున్నాం.... పట్టాలివ్వండి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: నగరంలోని 40 వ డివిజన్ కామ్రేడ్ పార్వతమ్మ కాలనీలో 20 ఏళ్ళుగా నివాసముంటున్న పేద ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ని డిమాండ్ చేశారు. అధికారపార్టీ చేపట్టిన గడపగడపకు వైసీపీ కార్యక్రమంలో భాగంగా శనివారం కాలనీకి వచ్చిన ఎమ్మెల్యే వెంకట రామిరెడ్డి ని స్థానిక ప్రజలతో కలసి సీపీఐ నాయకులు అడ్డుకున్నారు. కామ్రేడ్ పార్వతమ్మ కాలనిలో 20 ఏళ్ళుగా నివాసముంటున్న పేద ప్రజలు ప్రభుత్వానికీ చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. వెంటనే వారికి పట్టాలు మంజూరు చేయడంతోపాటు కాలనీలో రోడ్లు, మురుగు కాల్వలు , త్రాగు నీటి సౌకర్యం ఇతర మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో పాఠశాల విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందని పలుమార్లు అధికారులకు తెలియ జేసినా పట్టించకోలేదని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వెంకట రామిరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కాలనీ కార్యదర్శి మునాఫ్, రాంబాబు, శంకర్, కమ్మక్కనాగ మునెమ్మ, రాము, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంతకల్లు : 137వ మేడే నీ కార్మికులు ప్రజా సంఘాల నాయకులకు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం గుంతకల్లు మండలంలో నెలగొండ గ్రామంలో హమాలీలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం గోవిందు అధ్యక్షతన వహించారు.ఈ సమావేశంలో సిపిఐ నియోజవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి,సీపీఐ పట్టణ కార్యదర్శి గోపినాథ్ ,ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్య,సీపీఐ మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ... మే ఒకటో తారీఖున ఘనంగా ప్రపంచవ్యాప్తంగా ఉత్సాహంగా మే డే ని జరుపుకోబోతున్నారని అందులో భాగంగా గుంతకల్లు పట్టణంలో మిల్లు హమాలీ ఆఫీస్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు పెద్ద ఎత్తున కార్మిక యూనియన్ సంఘాలు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించబోతున్నామని తెలిపారు. సీపీఐ సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ఐటీయూసీ, వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి సురేష్, జనసేన రాష్ట్ర ఇన్స్పెక్టర్ మురళి కృష్ణ ,నెలగొండ హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎంత నిర్లక్ష్యం !

కుప్పకూలిన రథం
అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి రథం శనివారం మరమ్మత్తులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది. మే రెండవ తేదీ నుంచి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. మే 10వ తేదీన బ్రహ్మ రథోత్సవం లాగుడు కార్యక్రమం జరగాల్సి ఉంది. ఇంతలో ఈ సంఘటన జరగడం పట్ల భక్తులు అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. 400 సంవత్సరాల క్రితం తయారుచేసిన ఈ రథం శిథిలావస్థకు చేరుకున్నదని కొత్త రథం తయారు చేయాలని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయ అధికారులకు విరాళాలు కూడా అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా భక్తులు దాదాపు 76 లక్షల రూపాయలను రథం యొక్క నిర్మాణానికి విరాళాలను అందజేసినప్పటికీ కొత్త రథం తయారు చేయడంలో అధికారులు జాప్యం కాలయాపన చేస్తున్నడం పట్ల భక్తులు ఆగ్రహాలను వ్యక్తం చేస్తున్నారు. శనివారం రోజు కూడా ఎలాంటి టెక్నికల్ యొక్క అధికారులు సహకారం లేకుండానే కొంతమంది స్థానిక కార్పెంటర్లతో క్రేన్లు సహాయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా మరమ్మత్తులు చేయడం వల్ల ఈ సంఘటన జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తుల నుంచి ఆదాయం రావడమే కాకుండా దాదాపు 2134 ఎకరాలు భూమిని కూడా కలిగి ఉంది. ఈ భూముల యొక్క లీజు దారుల నుంచి సంవత్సరానికి 40 లక్షల రూపాయలు కూడా

ఆదాయం వస్తుంది.అంతేకాకుండా సంవత్సరానికి హుండీ ద్వారా కోటి రూపాయలు ఆదాయం వస్తుంది.పెన్నాహోబిలం లక్ష్మీనరసింహస్వామిని ఆంధ్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలలో కూడా లక్షలాదిమంది భక్తులు ఇంటి దైవంగా పూజిస్తారు. ఇంత పెద్ద ఎత్తున భక్తులను, ఆదాయ వనరులు కలిగివున్న ఈ దేవాలయానికి నూతన రథం తయారు చేయించడంలో దేవాదాయ శాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందినట్లు భక్తులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-అనంతపురం: భారత జాతీయ మహిళా సమాఖ్య పిలుపుమేరకు అనంతపురం నగరంలో రెజలర్స్‌కు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రాజమ్మ కాలనీలో నిరసనచేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు జిల్లా కార్యదర్శి పార్వతి ప్రసాద్ పద్మావతి పాల్గొని మాట్లాడుతూ ప్రతిభ ద్వారా అనేక పతకాలు సాధించి దేశానికే వన్నె తెచ్చి ,దేశ గౌరవాన్ని ప్రపంచ చిత్ర పటం లో నిలిపిన క్రీడా కారులు నేడు ఢిల్లీ పురవీధుల్లో న్యాయం కోసం పోరాడవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా, ప్రపంచ స్థాయిలో ,ఒలంపిక్ క్రీడలలో తమ ప్రతిభను కనపరుస్తూ విజయ సాధించి అనేక పతకాలను భారతదేశానికి తెచ్చి పెట్టీ దేశానికి గౌరవాన్ని తెచ్చిన రెజలర్లు (మల్ల యోధులు,లేదా కుస్తీ పోటీ క్రీడాకారులు) నేడు మనువాద బీజేపీ నాయకుల వల్ల లైంగిక వేదింపులకు గురౌతున్నారన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్ సంఘపరివార శక్తులకు బుద్ధి చెప్పే విధంగా ఉద్యమాలు చేపడతామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య నగర అధ్యక్ష కార్యదర్శులు జానకి కుర్షిదా కమ్మక్క యశోదమ్మ లక్ష్మి సులోచన వసంత బేగం రేణుక చాందిని తదితరులు పాల్గొన్నారు

డాక్టర్ ఖాదర్ వలీకి ఘన సన్మానం

విశాలాంధ్ర-ఉరవకొండ: సిరి ధాన్యాల సృష్టికర్త పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీని నిస్వార్థ జై కిసాన్ ఫౌండేషన్ నాగమల్లి ఓబులేష్, మరియు ఆదరణ పాడి పంట శ్రీ రామకృష్ణ తదితరులు ఘనంగా సన్మానించారు. పద్మశ్రీ అవార్డు వచ్చిన తర్వాత మొట్టమొదటిసారి శనివారం అనంతపురం నగరానికి రావడంతో పట్టణంలోనే కమ్మ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనను కలిసి అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. రైతు లోకానికి సిరి ధాన్యాలను ప్రసాదించి తద్వారా లాభాన్ని ఆదాయాన్ని తెచ్చి పెట్టినందుకు గాను అనంతపురం రైతు సోదరులు అందరి తరపున జై కిసాన్ ఫౌండేషన్ ఘనంగా సన్మానించి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసింది. అదేవిధంగా రెండు మూడు నెలల్లో సిరి ధాన్యాలపై అవగాహన సదస్సు కొరకు ఉరవకొండ కి రావాలని ఆహ్వానించడం జరిగిందని ఓబులేసు విలేకరులకు తెలిపారు.

ఓట్ల తొలగింపు పై విచారణ

విశాలాంధ్ర-విడపనకల్లు: మండల పరిధిలోని గడేకల్, హంచనహాల్, విడపనకల్లు తొలగింపు ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో రవీంద్ర, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఆర్ ఐ ఆదినారాయణ, వీఆర్వోలు నరసారెడ్డి, హరి ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం ఆదేశానుసారం అంతర్జాలంలో లేదా నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వాటిపై క్షేత్రస్థాయి విచారణ చేసి నమోదు చేస్తున్నారు. ఓటరు నమోదు, చేర్పులు, మార్పులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం పోలింగ్ బూత్‌లలో 5 శాతం కన్నా ఎక్కువ ఓటర్లను తొలగించిన వాటిని నిశితంగా పరిశీలిస్తున్నారు. ఓటరు జాబితా నమోదులో ఉండి స్థానికంగా లేకున్నా, చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లను ఇటీవల బీఎల్‌వోలు తొలగించారు. మండలాల్లో 20కి పైగా పోలింగ్ బూత్‌ల్లో 5 శాతం కన్నా ఎక్కువ ఓట్లు తొలగించారు. దీంతో పోలింగ్ బూత్ జాబితాతో ఇంటింటా ఆర్డీవో, తహసీల్దారు, అధికారులు సర్వే చేపడుతున్నారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు బృందాల సర్వే గా చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

విశాలాంధ్ర-రాప్తాడు: జగనన్న ఇళ్ల నిర్మాణాల, మౌలిక సదుపాయాల కల్పనపై తహశీల్దార్ లక్ష్మీనరసింహ శనివారం బొమ్మేపర్తిలో నిర్మిస్తున్న గృహాలను సందర్శించారు. తహశీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గృహ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. బేస్‌మెంట్ స్థాయిలోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. ఇంజి నీరింగ్ అసిస్టెంట్ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్ఓ లింగారెడ్డి ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

విశాలాంధ్ర-విడపనకల్లు: ప్రస్తుతం వేసవి ని దృష్టిలో ఉంచుకొని మండలంలోని గ్రామా ల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండా లని ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి అధికారులకు సూచించారు.శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పలు శాఖలలో జరు గుతున్న పనులను అధికారులు సభ్యులకు వివ రించారు. జడ్పీటీసీ హనుమంతు సొసైటీ చైర్మన్ బి శ్రీరాములు తహసీల్దార్ బ్రహ్మయ్యఎంపీడీవో శ్రీనివాసులు , వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యం

విశాలాంధ్ర-తాడిపత్రి: క్రీడలను ప్రోత్సహించాలన్న ముఖ్య ఉద్దేశంతో ఆర్డిటి సంస్థ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా వ్యాప్తంగా క్రికెట్ శిక్షణ కార్యక్రమాలను ఆర్డటీ నిర్వ హిస్తుందని ఆర్డిటి ఏటిఎల్ రామాంజనేయులు, ఆర్డిటి సీనియర్ కోచ్ సాదిక్ వలి, భార్గవ్ చెప్పారు. పట్టణంలో జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ శిక్షణ కార్యక్రమాన్ని 01-05-2023 నుండి ప్రారంభం కానున్నది .తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి 18 ఏళ్ళలోపు యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. సమాచారం కొరకు సెల్ నెంబర్లు: 9347640651, 9059969794 సంప్రదించాలని చెప్పారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న సీఎం జగన్

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని మెగా డీఎస్సీ ద్వారా 50 వేల పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని సీపీఐ అనుబంధం ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈమేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్ లో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ తో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని ఏకరువు పెట్టారు.ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు 1 వేల రూపాయలు ప్రతి నెలా వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతిఏటా ఉద్యోగాల భర్తీకి లక్ష ఉద్యోగాలతో నోటిఫికేషన్ విడుదల చేస్తానని హామీ ఇచ్చిన వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి నేడు మాటతప్పి నిరుద్యోగులను విస్మరించాడని విమర్శించారు.ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను సీఎం జగన్ నిలువునా మోసం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని నమ్మబలికి ఓట్లు దండుకుని గద్దెనెక్కిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు వారంతా రోడ్డున పడేలా చేశాడని మండిపడ్డారు.ఉద్యోగాలు భర్తీ చేయడంలో సీఎం జగన్ జాప్యం చేస్తున్నారని నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో బిఈడి, టిటిసి అభ్యర్థులు సైతం నిరాశకు గురౌతున్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ

చేసేందుకు తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని,20 వేల పై చిలుకుగా ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం అన్ని విద్యార్థి యువజన సంఘాలు ఐక్య కార్యాచరణతో ఉద్యమ బాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యువత స్వయం ఉపాధి కోసం ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్ లకు అధిక నిధులు కేటాయించి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి మోహన్ కృష్ణ,నాయకులు దేవా, నిఖిల్ ,వినయ్ పాల్గొన్నారు.

అన్నదానం విరాళాలలో అక్రమాలకు పాల్పడుతున్నారు

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నాహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నదానం కోసం భక్తులు ఇచ్చే విరాళాలలో ఆలయ ఈవో కె. విజయ్ కుమార్ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు ఆరోపించారు. రాఘవేంద్ర అనే భక్తుడు శనివారం కుటుంబ సభ్యులు తో కలిసి ఈవోతో తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ తాము పది రోజుల క్రితం పెన్నహోబిలం స్వామి దర్శనం కోసం వచ్చామని అన్నదానం చేయాలన్న కోరికతో ఈవో దగ్గరికి వచ్చి అన్నదానం చేయడానికి ఒక రోజుకి ఎంత ఖర్చవుతుందని అడిగామని 15వేలు రూపాయలు అవుతుందని చెప్పగా తాము ఇచ్చామని తమకు రిసిప్ట్ కూడా ఇవ్వలేదని అయితే అన్నదాన కార్యక్రమంలో భక్తులకు కనీసం క్వాలిటీ భోజనం కూడా వడ్డించలేదని ఇస్తరాకులు, మంచినీళ్లు కూడా భక్తులకు సరఫరా చేయలేకపోయారని ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వారు ఆరోపించారు. ఇది ఇలా ఉండగా పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నదాన నిర్వహణ కోసం ఆంధ్ర, కర్ణాటక కి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విరాళాలను అందిస్తుంటారు అయితే ఆలయ అధికారులు విరాళాలు ఇచ్చిన వారికి కనీసం రిసిప్ట్ ఇవ్వడం లేదని ఆరోపణలు అనేక రోజులు నుంచి ఉన్నాయి. అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని జిల్లా దేవదాయ శాఖ అధికారుల దృష్టి కూడా భక్తులు తీసుకెళ్లినప్పటికీ వారు కూడా దీని మీద స్పందించలేదని ఆరోపణలు ఉన్నాయి.ఇప్పటికే భక్తులు పెద్ద సంఖ్యలో రథం నిర్మాణానికి 76 లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు ఇచ్చి మూడేళ్లు కావస్తున్న రథం నిర్మాణం మాత్రం ప్రారంభం కాలేదు దీనిపై కూడా భక్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహంతో ఉన్నారు ఆలయంలో అనేక అవినీతి అక్రమాలు బహిరంగంగా జరుగుతున్న భక్తులు బహిరంగంగా తమ ఆవేదనను తెలియజేస్తున్నప్పటికీ కూడా ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తాను ఇచ్చిన విరాళం సద్వినియోగం అవుతుందా కాదా అని సందేహంలో భక్తులు ఉన్నారు ఇప్పటికైనా రాష్ట్ర స్థాయి అధికారులు స్పందించి పెన్నహోబిలం ఆలయంలో జరుగుతున్న జరిగిన అవినీతి అక్రమాలు అన్నింటిపై కూడా సమగ్ర విచారణ జరపాలని భక్తులు కోరుతున్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం వస్త్ర,అన్నదానం, చేసినట్లు ఆశ్రమ నిర్వహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు.ఈ సందర్భంగా పరిమి కృష్ణవేణి మాట్లాడుతూ సిద్దవటం శ్రీరామిరెడ్డి ఒకటవ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులందరికి వస్త్రదానం, అన్నదానం చేసారన్నారు. అన్న, వస్త్రదానం చేసినందుకు వృద్ధులు సిద్దవటం శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ సభ్యులు కుమారులు ఎస్. బాల నారాయణరెడ్డి,ఎస్. అమరనాథ్ రెడ్డి,మనవండ్లు ఎస్. యస్వంత్ రెడ్డి,ఎస్. లోకేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆరాధన మహోత్సవం

విశాలాంధ్ర-పుట్లూరు: మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ సమీపంలో బ్రహ్మంగారి గుడి వద్ద రేపు ఆదివారం ఆరాధన మహోత్సవం నిర్వహించడం జరుగుతున్నది. అందులో భాగంగా ఉదయం 6 గంటల నుంచి పూజారి గంగన్న ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అనంతరం అన్నదాననిర్వహించి దాతల సహకా రంతో కోదండ రామ చెక్కభజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పూజారి గంగన్న తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-రాప్తాడు: స్థానిక మోడల్ స్కూల్ లో 8వ తరగతి చదువుతున్న కే.సాయి కుమార్ అనే విద్యార్థి శనివారం అనంతపురం ఆర్డిటి క్రీడామైదానంలో జరిగిన సాఫ్ట్బాల్ జూనియర్ పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు ఎంపికకు పోటీలు జరగగా రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ పద్మ జాదేవి, పీఈటీ మల్లికార్జున తెలిపారు. 26, 27, 28వ తేదీల్లో అన్నమ య్య జిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటాడన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేయాలి

విశాలాంధ్ర-విడపనకల్లు: అసలు వడ్డీ కట్టించుకోకుండా స్కెల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు పంట రుణాలు పెంచి రెన్యువల్ చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల రంగయ్య, రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరులో ఉన్న గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు. గత ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని నష్టపోయా యన్నారు. రైతులు బసన్న గౌడ్, గోవిందప్ప, కుబేర,రవికుమార్ పాల్గొన్నారు.

మహిళ మృతి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మిద్దిపై నుంచి కిందకు వస్తున్న వర్షం నీటిని నిలువ ఉంచు దామని ఆశపడ్డ గృహినికి మృతి వెంటాడింది.. వర్షం జోరుగా కురుస్తుండగా బిందె నిండా నీళ్లు తెస్తామని వెళ్లిన భాను ప్రియ (32) కు మిద్దె పైనుంచి కిందకు వేలాడుతున్న విద్యుత్ షాక్ కొ ట్టింది. అంతే క్షణాల్లో భానుప్రియ మృతి చెందింది. రాచప్ప కుంట ప్రాంతానికి చెందిన పూజారి నరసిం హులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. భార్య భానుప్రియ కళ్ళముందే చనిపో వడం చూసి తట్టుకోలేకపోయాడు భర్త నరసింహులు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 30, ఏప్రిల్ 2023

సీఎం కప్ పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: ఇటీవల జిల్లా స్థాయిలో వివిధ క్రీడా సాయి నిర్వహించినటువంటి పోటీలకు, ప్రతిభ కనపరిచిన స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సీఎం కప్పు పోటీలకు ఎంపిక కావడం జరిగిందని ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ మే ఒకటి నుండి ప్రారంభమయ్యేటువంటి రాష్ట్రస్థాయి వివిధ క్రీడా పోటీలకు జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించడం జరుగుతుందన్నారు. మా డిగ్రీ కళాశాలలోని హకీ క్రీడా విద్యార్థులు ఎం. రాజేష్, ఎస్. మద్దిలేటి, ఎం. శ్రావణి, అదేవిధంగా టేబుల్ టెన్నిస్ లో ఎల్. ఇంద్ర వాణి అనే విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తో పాటు వైస్ ప్రిన్సిపాల్. జీవన్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఆనంద్, అధ్యాపకులు చిట్టెమ్మ ,శమీ ఉల్లా, కిరణ్ కుమార్, గోపాల్ నాయక్, పావని, భువనేశ్వరి, పుష్పావతి, గౌతమి, బోధనేతర సిబ్బంది ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రసా భసాగా కౌన్సిల్ సమావేశం

సమావేశాన్ని బహిష్కరించిన టీడీపీ కౌన్సిలర్లు

విశాలాంధ్ర-పుట్టపర్తి: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రస భాసాగాసాగింది. శనివారం మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి అభివృద్ధి సమస్యల పైన టిడిపి వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం జరిగింది. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి చెప్పిన వారికి ఏకపక్షంగా టెండర్లను కట్టబెట్టి మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని టిడిపి ఫ్లోర్ లీడర్ చౌదరి ఆరోపించారు. టెండర్లను ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారని ఎమ్మెల్యే కి ఎటువంటి సంబంధం లేదని వైసిపి కౌన్సిలర్లు తెలిపారు. టిడిపి కౌన్సిలర్లు వార్డులలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని మేము సమావేశం నుంచి బహిష్కరిస్తున్నామని బయటికి వెళ్లిపోయారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న మాట్లాడుతూ సాయి నగర్ లో చెత్తాచెదారం విపరీతంగా పేరుకుపోతుందని అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగులు మా ప్రాంతానికి రాలేదని కమిషనర్ కి ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ సాయి గీత మాట్లాడుతూ ఎనిమిదో వార్డులో చెత్త పేరుకుపోయిందని ప్రాంతంలో దుర్వాసనతోందని వెంటనే చెత్త తీయించాలని కౌన్సిల్ కి ఫిర్యాదు చేశారు. పట్టణంలో పందులు విపరీతంగా తిరుగుతున్నాయని, పట్టణమంతా స్వైర విహారం చేస్తున్నాయని ఆరోపించారు. కౌన్సిలర్ సూర్య గౌడ్ మాట్లాడుతూ పట్టణంలో కోతులు విపరీతంగా తిరుగుతున్నాయని అటవీ శాఖ అధికారులకు కౌన్సిల్ వ్రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. రోడ్లపై కుక్కలు విపరీతంగా తిరుగుతున్నాయని వాహనాల రాకపోకలకు అడ్డంకుగా మారాయి అన్నారు. వీటికి కమిషనర్ వెంకటరామిరెడ్డి స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల పిఎస్ పరిధిలోని ఎన్ఎస్పి కొట్టాల గ్రామ సమీపంలో శనివారం పట్నం ఎస్సై శరత్చంద్ర ఆధ్వర్యంలో పేకాట ఆడుతున్న పేకాట స్థావరాలు పై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి నగదు 5870 రూపాయలు నగదు మరియు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్నం ఎస్సై శరత్చంద్ర తెలిపారు.

జోరు వానలో పాదయాత్ర

విశాలాంధ్ర-పెనుకొండ: నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత శనివారం మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అనంతరం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం క్యాంప్ నుండి 84 వ రోజు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువగళం సారథి నారలోకేశ్తో కలసి ఆయనకు రాఘవేంద్ర స్వామి ప్రసాదాలు అందజేసి కలసి మాట్లాడి అనంతరం జోరు వాన కురుస్తున్న పాదయాత్రను నారా లోకేష్ తో కలిసి కొనసాగించారు.

పన్నులు చెల్లించి రాయితీ పొందండి

విశాలాంధ్ర-కదిరి: మున్సిపాలిటీలో ని ప్రజలు 2023-2024 ఆర్థిక సంవత్సరమునకు అడ్వాన్స్ గా ఇంటి పన్నులు చెల్లించి 5శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు తెలిపారు. 30తేదీ ఆదివారం సెలవు రోజు కూడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద చెల్లించ వచ్చునని పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి కోరారు.

ఎల్‌జిబి నగర్‌లో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'

విశాలాంధ్ర-రొద్దం: మండల పరిధి శనివారం క్లస్టర్ ఇంచార్జ్ వన్ నాగేంద్ర ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి జగన్ ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రతి కుటుంబానికి తెలియజేసి మన రాష్ట్రాన్ని కాపాడుకుందాం అనే నినాదాలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పర నాగభూషణం, నాయకులు ప్రకాశ్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, రామిరెడ్డి అంజనేయులు, హెచ్ అంజనప్ప, ఈడిగనాగభూషణం, ఈడిగ ప్రవీణ్, గొల్ల నాగభూషణం, టిడిపి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్షలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని శనివారం మూడు పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్ష లు సజావుగా నిర్వహించారు. పట్టణములో మూడు కేంద్రాలుగా పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు 192 విద్యార్థులను కేటాయించగా 18 మంది పరీక్షకు హాజరు కాలేదు. 174 మంది పరీక్ష రాశారు. ఈ కేంద్రానికి చీఫ్ సూపరెంటెంట్ గా చంద్రశేఖర్ వ్యవహరించగా సి యల్ ఓ గా రాధ వ్యవహరించారు. జిల్లా పరిషత్ సెంట్రల్ స్కూల్ నందు 192 మందిని కేటాయించగా 171 మంది పరీక్ష రాయగా 21 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఈ కేంద్రానికి సిఎస్ గా కవిత సిఎల్వోగా వేదవతి వ్యవహరించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు 190 మంది విద్యార్థులను కేటాయించగా 175 మంది పరీక్షలు రాయిగా 15 మంది పరీక్షకు హాజరు కాలేకపోయారు. ఈ కేంద్రానికి సి ఎస్ గా జ్యోతిర్లత, సిఎల్ఓగా నాగార్జునుడు వ్యవహరించారు. ఈ మూడు కేంద్రాలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రంగస్వామి పరిశీలించారు. ఎటు వంటి ఇబ్బంది లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించామన్నారు.

వైసీపీ కార్యకర్త మృతికి నివాళి

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని అమ్మవారుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త ఈశ్వరయ్య(55) కిడ్నీ వ్యాధితో శనివారం మరణించగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మంగమ్మ మృతునికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని, అండగా పార్టీ ఉంటుందని, ఎల్లప్పుడూ మేము తోడుగా ఉంటామని బాధితులకు భరోసా కల్పించారు. ఆమెతోపాటుగా మాజి సింగిల్ విండో ప్రెసిడెంట్ శ్రీనివాసులు, వైసిపి నాయకులు పోగాకురామచంద్ర , నీరుగం టి వెంకటరాముడు, వైస్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, బయపరెడ్డి , నారాయణరెడ్డి, నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: వేసవి సెలవులు సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశాన్ని ఎంఈఓ వెంకటరమణ నాయక్, హెచ్ఎం చిన్న కృష్ణారెడ్డి నిర్వహించారు. ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించినందున విద్యార్థులు కాలాన్ని వృధా చేయకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించి చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మండల కేంద్రంలో విద్యార్థులు గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను చదువుకోవాలన్నారు. వీటితోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి కనపరచాలన్నారు. పాఠశాలల హెచ్ఎం లు సుమన, శివయ్య, చౌదరి, భాస్కర పాల్గొన్నారు.

బావిలో పడి మహిళ మృతి

విశాలాంధ్ర-లేపాక్షి: మండల పరిధిలోని శిరివరం గ్రామానికి చెందిన గంగరత్నమ్మ (54) అనే మహిళ బావిలో పడి మృతి చెందిందని ఏఎస్ఐ షర్ఫుద్దిన్ తెలిపారు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. మృతురాలి భర్త పి.గంగప్ప తెలిపిన మేరకు వివరాలు ఇలా వున్నాయి. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఈనెల 25వ తేదిన కుమార్తెకు శుభ కార్యక్రమం నిర్వహించి డబ్బులు ఖర్చు చేసింది. శుభ కార్యాం అయిన మరుసటి రోజు ఖర్చు పెట్టిన మొత్తం ఇవ్వాలని కల్లు బాగా సేవించి కుమారుడిని డిమాండ్ చేసింది. రెండు రోజులు తరువాత ఇస్తానని చెప్పగా ఆమె కోపంతో నీవు ఇస్తానా, నేను ఎక్కడికైనా వెళ్లి చనిపోవాలా అని ఒత్తిడి చేసింది. అలగడం ఈమెకు కొత్త కాదు. అదే కోపంతో వెళ్లి గంగిరెడ్డికి సంబంధించిన బావిలో పడింది. అయితే శనివారం ఉదయం బావిలో శవం తేలాడడం చేసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఏఎస్ఐతో పాటు పోలీసులు అక్కడికి వెళ్లి శవంను బయటకు తీయించి పోస్టు మార్టం నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏ ఐ టి యు సి ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, హిందూపురం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఇన్సూరెన్స్‌తోపాటు ఉద్యోగం ఇవ్వాల న్నారు. ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తిరుమలేష్ , కార్యదర్శి నవీన్ కుమార్, కోశాధికారి సురేష్,గౌరవ సలహాదారులు ముత్యాలప్ప, ఈరప్ప, ఉపాధ్యక్షులు బాలాజీ, వెంకటేష్, కిరణ్, సహాయ కార్యదర్శులు బాలాజీ, మూర్తి, వినోద్ తదితరులుపాల్గొన్నారు.

మే డే బహిరంగ సభను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి: నేడు కదిరి పట్టణంలో జరిగే మే డే బహిరంగ సభను జయ ప్రదం చెయ్యాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. శనివారం కదిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బహిరంగ సభకు సంబందించిన కర పత్రాలను సీపీఐ వేమయ్య యాదవ్ విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద మే డే సందర్భంగ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో జరుపుకొనే పండుగ ఏదైన ఉందంటే అది కేవలం మే డే ఒక్కటే అన్నారు.దేశంలొ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తర్వాత కార్మికులను పలు రకాలుగా ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని కార్మికులంతా ఏకమై మోడి ప్రభుత్వాన్ని గద్దె దించాలని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కార్మికులు, ఆటో కార్మికులు, అంగన్వాడీ,మునిసిపల్, ఆశ, సోలార్, కార్మికులు మేధావులు సీపీఐ పార్టీ అనుబంధ సంఘలా నాయకులు హాజరు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి కదిరప్ప, డివిజన్ సహాయ కార్యదర్శి రాజేష్, సిపిఐ నాయకులు తిప్పన్నా, శంకర్ నాయక్ ,రమణ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఉపేంద్ర, జనార్ధన్, టిప్పు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాక

పట్టణంలో నిర్వహిస్తున్న మే డే బహిరంగ సభకు ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి జి. ఓబులేసు హాజరుకానున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సురేంద్ర తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సాయంత్రం 4 గంటలకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి యం. వేమయ్యయాదవ్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ఇషాక్,ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ మధు నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన సంప్రోక్షణ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని ప్రముఖ మహిమగల దుర్గమ్మ దేవత దేవస్థానంలో ఈనెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు మూడు రోజులు పాటు సంప్రోక్షణ మహోత్సవ వేడుకలు ఆలయ ఈవో వెంకటేశులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సిరిపి పర్వతయ్య, దాతల, భక్తాదులు సహకారంతో నిర్వహించ బడుతున్నాయి. ఇందులో భాగంగా మూడవ రోజు శనివారం రోజు దుర్గమ్మ తల్లిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, వివిధ ఆభరణాలతో అలంకరించి, ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. ఈ వేడుకకు ఆలయ కమిటీ వారు మేరకు తిరుమల తిరుపతి వేద పాఠశాల నుండి రామకృష్ణ శర్మ, పనింద్ర ,సురేష్, రవీంద్రనాథ్, నాగసాయి, లోకనాథ శర్మ, శ్రీ చంద్ర న్ లచే వేద మంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ, సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. తదుపరి అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం, నూతన ముఖ తోరణంల ప్రారంభము, ప్రాకార రథమును ప్రారంభము, పూర్ణాహుతి,ఉస్మాండ బలి, బింబ దర్శనము ను అత్యంత వైభవంగా భక్తాదులు నడుమ అర్చకులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కి ఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికారు. ఈ అన్నదాన కార్యక్రమంలో దాదాపు నాలుగు వేల మందికి పైగా భక్తాదులు పాల్గొన్నారు అని తెలిపారు. ఉభయ దాతలచే ఉదయం హోమాలు కూడా అర్చకులు నిర్వహించారు. ఆలయానికి రెండు వైపులా ఆలయ ముఖ తోరణం దాతలను, అమ్మవారి ప్రాకారోత్సవమునకు టేకుతో రథము చేయించిన సేవా కర్తలను, ముఖ్యమైన దాతలను కూడా ఆహ్వానించి, వారి పేరిటన ప్రత్యేక పూజలు తోపాటు ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు సాగా మురళి, గుర్రం రాధా, గుజ్జల నాగమ్మ, సాకే చౌడప్ప, నామ రాజశేఖర్ గుప్తా, బోయ నారాయణ, బోయ దుర్గ భవాని, పూజారి రామాంజనేయులు, ఆలయ మేనేజర్ రామశాస్త్రి, భక్తాదులు పాల్గొన్నారు.

ప్రత్యేక వాహనాలలో దర్శనమిచ్చిన చెన్నకేశవుడు

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం వారి బ్రహ్మోత్సవ వేడుకలు 27వ తేదీ నుండి మే నెల 7వ తేదీ వరకు లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ వేడుకలు ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఆలయ ఈవో వెంకటేశులు, ఆలయ వైస్ చైర్మన్ కుండా చౌడయ్య,ఆలయ డైరెక్టర్లు, దాతలు, భక్తాదుల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించబడుతోంది. ఇందులో భాగంగా శనివారం స్వామివారు ఉదయం సర్వ భూపాల వాహనంలో సాయంత్రం సింహ వాహనంలో పట్టణ పురవీధులలో ఊరేగిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్, చక్రధర్, గుణ స్వామి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దాతలైన రంగన్న అచ్చప్ప అండ్ సన్స్, జూజారు సత్యప్రభ,సురేష్, రాధా, నీలూరి శ్రీనివాసులు, కుంబర్తి శ్రీధర్, మనిషా, జనదీప్, పుట్లూరు కుళ్లాయప్ప అండ్ సన్స్, అడ్డగిరి గోపాల్, కీర్తిశేషులు చుక్కలూరు సోలిగాళ్ళ నాగమ్మ, ఆంజనేయులు అండ్ సన్స్, కమ్మ శేషన్న జ్ఞాపకార్థం కుమారులు ఎరిటన వారి కుమారులు పేరిటన అర్చనతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సత్కరించారు. ఆలయ డైరెక్టర్లు జగ్గా జయలక్ష్మి, పోరాల్ల పద్మావతి, సత్రశాల సత్యనారాయణ, సౌందర్య లహరి సునీత, గిర్రాజు మహాలక్ష్మి, అన్నమయ్య సేవా మండలి పోరాల్ల పుల్లయ్య, వారి శిష్య బృందం, అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల జాగ్రత్త వహించండి

విశాలాంధ్ర - అగళి : పాఠశాల సంవత్సరం ముగిసిన నేపథ్యంలో వేసవి సెలవుల్లో తమతమ పిల్లలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చక్రదారి తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో శనివారం పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో విద్యార్థుల విద్యాప్రగతి పాఠశాల ఆర్థిక లావాదేవీలు , వేసవి సెలవుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకోవాలసిన జాగ్రత్తలు, చర్యలు రాబోయే విద్యాసంవత్సరంలో విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పాఠశాల పాలకమండలి సభ్యులు, ఉపాద్యాయులు, పాలకమండలి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-లేపాక్షి: లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయంలో 5వ తరగతి ప్రవేశ కోసం శనివారం ఉదయం ప్రవేశ పరీక్ష 42 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగిందని విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8774 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 7850 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. అయితే ఈ పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ కింద శ్రీసత్యసాయి జిల్లా సోషియల్ వేల్ఫేర్ ఆండ్ ఎంపవర్ మెంట్ ఆఫీసర్ శివరంగప్రసాద్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫీసర్ మోహన్రామ్, జిల్లా మత్స్యశాఖ ఆఫీసర్ చంద్రశేఖరెడ్డి, డిఆర్డీఏ పీడీ నరసయ్య, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ కృష్ణ నాయక్, పర్యవేక్షించారన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని అధికారులను శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు కోరారు. శనివారం కొత్తచెరువు లోనే ధర్మవరం రోడ్డు నందు ఉన్న 384 సర్వే నెంబర్లు లో ఉన్న జగనన్న కాలనీ ఆయన పరిశీలించారు. ఇక్కడ నిర్మిస్తున్న ఇళ్ల పురోగతి గురించి పరిశీలించి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. కాలనీలలో ఎందుకు ఇల్లు నిర్మాణాల్లో జాప్యం చేస్తున్నారని, లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు, సిమెంటు ఇవ్వాలని సూచించారు. ఇంకా ఇల్లు నిర్మాణాలు మొదలు పెట్టని వారి జాబితాన్ని సిద్ధం చేసి వారు ఎందుకు నిర్మించుకోలేదు వారి అభిప్రాయం తెలపాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నవారికి 35 వేల రూపాయల రుణాలను బ్యాంకుల ద్వారా తక్షణమే మంజూరు చేయించాలన్నారు. మూడు లేఔట్ లోను 750 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, అయితే ఎక్కువమంది పునాదులకే పరిమితమయ్యారని, వారు ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. తాగునీరు, విద్యుత్తు, రహదారులు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పెనుగొండ రహదారిలో జగనన్న కాలనీ పై భాగంలో ఉన్న నల్ల కొండను ప్రజాప్రతినిధులు రాజకీయ పలుకుబడితో ఆ కొండను తవ్వి ట్రాక్టర్లతో మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని, వారి పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని తాహసిల్దార్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, తాహసిల్దార్ రామాంజనేయరెడ్డి, విద్యుత్ ఏ డి షాజహాన్, హౌసింగ్ డిఇ నాగరాజు, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, విద్యుత్ ఏఈ వెంకటేష్ నాయక్, ఏ పి ఎం నాగేంద్ర, ఏపీవో నాగిరెడ్డి మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మే డే ర్యాలీని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - హిందూపురం పట్టణంలో మే 1వ తేదీన చిన్న మార్కెట్ నుండి ఉదయం 10 గంటలకు ఏఐటీయూసీ హిందూపురం పట్టణ సమితి ఆధ్వర్యంలో, మే డే ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.హిందూపురం పట్టణంలోని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలైన ప్రీకాట్ బి మిల్ ఎంప్లాయిస్ యూనియన్, భవన నిర్మాణ కార్మిక సంఘం, గ్రిల్ వర్కర్స్ యూనియన్, ఆటో యూనియన్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఆర్పిల యూనియన్, ఆశా వర్కర్స్ యూనియన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఇతర రంగాల్లో పనిచేస్తున్న ఎఐటియుసి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో, ర్యాలీలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. పని గంటల పోరాటంలో రక్తాన్ని చిందించిన చికాగో అమరవీరుల స్ఫూర్తితో ప్రపంచ కార్మిక దినోత్సవ కార్యక్రమాన్ని హిందూపురంలో ఘనంగా జరుపుతున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ హిందూపురం పట్టణ కార్యదర్శి మారుతి రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ సలహాదారుడు ముత్యాలప్ప, చేనేత కార్మిక సంఘం జిల్లా కోకన్వీనర్ వెంకటేశప్ప, ఫక్రుద్దీన్, జేబీఉల్లా, ప్రీకాట్ బి ఎంప్లాయిస్ యూనియన్ కోశాధికారి శ్రీనివాసులు, మాచప్పతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరపు పరీక్ష ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మే 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక పునఃశ్చరణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని డివి ఈవో. రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జరగబోయే సప్లమెంటరీ పరీక్షల్లో ఆయా సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన వారందరికీ కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూరిబా కళాశాలలు, మోడల్ కాలేజీలు, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు తప్పనిసరిగా ప్రత్యేక పునః చరణ తరగతులను నిర్వహించాలని వారు తెలిపారు. ఉత్తీర్ణులు అయ్యే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందని పూర్తి బాధ్యత ఆయా కళాశాల ప్రిన్సిపాల్ దేనని తెలిపారు.

ఇష్టారాజ్యంగా కోళ్ల వ్యర్థాలు

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల కేంద్రంలో కోళ్ల మాంసపు విక్రయదారులు ఇష్టారాజ్యముగా కోళ్ల నుండి వచ్చే వ్యర్థ పదార్థాలను గ్రామ సమీపంలో రహదారి వారి పక్కనే పడేస్తూ చోద్యం చూస్తున్నారు. ఈ విషయాలపై పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినను చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కాపు చన్నంపల్లి బీసీ కాలనీ వాసులు, పాదాచారులు, అటుగా వెళ్లే విద్యార్థిని విద్యార్థులు ఆ వ్యర్థాల దురవాసనతో ఇబ్బందులు పాలవుతున్నారన్నారు. శని, సోమవారాలలో వ్యర్థాలను వేయకపోవడంతో, గొర్రెల గుంపుల పై పడి, నష్టం చేస్తున్నాయి. ఇప్పటికే, కాపు చెన్నంపల్లి, వడ్డీచెన్నంపల్లి, చిలమత్తూరు గ్రామాల గొర్రెల కాపరులకు నష్టం కలిగిస్తున్నాయి మహా ప్రభు అంటూ వేడుకుంటున్నారు. కావున సంబంధిత అధికారుల స్పందించి చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.



పాలసముద్రం లో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం పంచాయితీ పరిధిలోని పాలసముద్రం గ్రామంలో సర్పంచ్ కాటేపల్లి గంగప్ప, ఎంపీపీ ప్రమీల మూర్తి, జడ్పిటిసి పాలే జయరాం నాయక్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఫ్రక్రుద్దీన్, సచివాలయ కన్వీనర్ గోవింద్ రెడ్డి, సామలపల్లి రాము ఆధ్వర్యంలో ముఖ్యఅతిథులుగా పెనుగొండ నియోజకవర్గం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ,హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మరియు మండల వైఎస్సార్సీపీ నాయకులతో కలసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్నారాయణను, ఎంపీ గోరంట్ల మాధవ్ ను స్థానిక నాయకులు గ్రామ ప్రజలు సాధారణంగా మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ గజమాలలతో ఘనంగా సత్కరిస్తూ శాలువులతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మొదటిగా ఎంపీ నిధులతో 10 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును, తదనంతరం 21.80 లక్షల రూపాయలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే శంకర్నారాయణ ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రారంభించారు. సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు పాటూరి శంకర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ భాషా మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నూర్ మహమ్మద్ మండల వైస్ ఎంపీపీలు నాగభూషణ్ రెడ్డి, రామలక్ష్మి సత్యనారాయణ ,మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, పట్టణ కన్వీనర్ ధనుంజయ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నూరు మొహమ్మద్, జిల్లా కోఆప్షన్ మెంబర్ డాక్టర్ భాష, సచివాలయం మండల కన్వీనర్ సమర సింహారెడ్డి,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్,శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, సర్పంచులు అశ్వర్థ రెడ్డి, ,ఆంజనేయులు, ముసలి రెడ్డి,ఉప సర్పంచ్ రాజారెడ్డి,సాయి, గంగాధర, ఆది, ఉపసర్పంచ్ లు రాజారెడ్డి, శ్రీనివాసులు, మరియు మండల ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా, తాసిల్దార్ రంగనాయకులు, మండల అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు ఏం చేశారు ?

విశాలాంధ్ర-పెనుకొండ: పట్టణంలో శనివారం ఎమ్మెల్యే కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే శంకరనారాయణ సమావేశంలో మాట్లాడుతూ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుద్ధిలేదనిని తన తండ్రీ చంద్రబాబు ఎమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, తేదేపా హయంలో ఎస్సీ,యస్టీ,మైనారిటి కుటుంబాలకు ఎం చేసారో చెప్పాలని, అన్ని కులాలకు న్యాయం చేసే విధంగా వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ముఖ్యమంత్రిగా ఉండి 139 కులాలను గుర్తించి 56 కార్పొరేషన్లలో దాదాపు 700 మంది డైరెక్టర్లు అవకాశాలు కల్పించి కార్పొరేషన్లు ఎర్పాటు చేసిన ఘనత వైసిపిదేనని తెలిపారు. లోకేష్ పాదయాత్రలో మదనపల్లిలో మాకేం చేసారని, కురుబ కులస్థులూ లోకేష్ని అడిగితే, తిప్పేస్వామికి పదవీ ఇచ్చాం కదా అని చెబుతాడు కురుబులకు యాదవులకు తెడా తెలీయని సుద్ద పప్పు లోకెష్ అంటు మండిపడ్డారు.